ప్రజాశక్తి

ఆదివారం 15 డిసెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కష్టంలో గుర్తొచ్చేది కమ్యూనిస్టులే

- ప్రజల మధ్య చిచ్చుపెట్టడమే బిజెపి లక్ష్యం
- ప్రజలపై భారం అని తెలిసినా అదాని ఒప్పందాల కొనసాగింపు
- సిపిఎం గుంటూరు జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి

జెండాను ఆవిష్కరిస్తున్న తియ్యగూర అంజిరెడ్డి

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు గుర్తొచ్చేది.. వారికి అండగా నిలిచేది కమ్యూనిస్టులేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని పి.ఎల్‌రావు భవన్‌లో సీతారాం ఏచూరి నగర్, వల్లభనేని సాంబశివరావు ప్రాంగణంలో సిపిఎం 25వ జిల్లా మహాసభ శనివారం ప్రారంభమైంది. మహాసభకు అధ్యక్షవర్గంగా కె,నళినీకాంత్, ఎస్.ఎస్.చెంగయ్య, ఎల్.అరుణ వ్యవహరించారు. రమాదేవి మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించే శక్తి కమ్యూనిస్టులకే ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలంటే కమ్యూనిస్టుల వద్దకే వస్తారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రజల మధ్య చిచ్చుపెట్టడానికి వివిధ రూపాల్లో యత్నిస్తోందని, యూనిఫాం సివిల్ కోడ్ పేరుతో ఆందోళనకు గురిచేసిందని అన్నారు. మోడీతో కలిసి పనిచేస్తున్న టిడిపి, జనసేన, వైసిపి ప్రజలకు నష్టం వచ్చే నిర్ణయాలు తీసుకోవడానికి కూడా వెనుకాడటం లేదన్నారు. విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలపై భారం పడుతుందని తెలిసినా ఆదాని ఒప్పందాలని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పాలన మారలేదన్నారు. ఎమ్మెల్యేలు ప్రతి పనికీ రేట్లు నిర్ణయిస్తున్నారని ధ్వజమెత్తారు. వైసిపికి, టిడిపికి తేడా లేదని

నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

▶ 2లో

మహాసభలో తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి జరగాలి

- రాజధానిలో స్కిల్‌సెంటర్ అవసరం
- తెనాలి, తుళ్లూరులో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి
- సిపిఎం గుంటూరు జిల్లా మహాసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ సిపిఎం జిల్లా మహాసభలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తీర్మానం ప్రవేశపెట్టారు. శని, ఆదివారాల్లో స్థానిక బ్రాడీపేటలోని జరుగుతున్న ఈ మహాసభలో ఈ తీర్మానంపై లక్ష్మణరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో 76 శాతం మంది కౌలు రైతులు సేద్యం చేస్తున్నారని తెలిపారు. జిల్లా మొత్తం మీద రైతులకు రూ.2600 కోట్ల రుణాలు ఇవ్వగా 76 శాతం ఉన్న కౌలు రైతులకు కేవలం రూ.40 కోట్ల రుణాలు ఇచ్చారని అన్నారు. కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులకు ఉన్న నిబంధనల వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 2019 కౌలు రైతు చట్టం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. భూ యజమాని సంతకం ఉంటేనే సిసిఆర్‌సి ఇస్తామనడం సరికాదని, ఈ నిబంధన ఎత్తివేసి చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కల్తీ విత్తనాలు, ఎరువుల నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా కల్తీ విక్రయదారులంతా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉండటం వల్ల అధికారులు వీరిని నిరోధించలేకపోతున్నారని ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా పట్టించుకోవాలన్నారు. మిర్చి రైతులను కోల్డ్ స్టోరేజి యజమానులు మోసం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో పంటల బీమా పథకం సక్రమంగా అమలు జరగటం లేదన్నారు. మిర్చి, ధాన్యం, పత్తి రైతులకు కనీస మద్దతు ధర లభించడం లేదన్నారు. దుగ్గిరాలలో శుభం కోల్డ్ స్టోరేజిలో తగలబడిపోయిన పసుపు పంట రైతులకు ఇంతవరకు నష్టపరిహారం అందలేదన్నారు.

జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అమలు సక్రమంగా లేదన్నారు. నీటి పారుదలరంగంలో కీలకమైన గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ, పొడిగింపు పనులు వెంటనే

▶ 2లో

దేశంలోనే కేరళ ముందజ

- రైతు ఆత్మహత్యల రహిత రాష్ట్రంగా ఆ రాష్ట్రం
- అక్కడి వామపక్ష ప్రజాప్రభుత్వ విధానాలే ప్రత్యామ్నాయం
- అది నచ్చకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్ష
- సంఘీభావ సభలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సభలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయంగా కేరళ వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం ప్రజానుకూల విధానాలు అనుసరిస్తూ అన్ని రంగాల్లో దేశంలోనే ముందంజలో ఉందని, దీన్ని ఓర్వలేని మోడీ ప్రభుత్వం కేరళపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మండిపడ్డారు. వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వ కక్షపూరిత తీరును నిరసిస్తూ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట

▶ 2లో

ఏకపక్షం!

- నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్య పదవులకు ఎన్నికలు
- 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం తొలి రోజు నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ముందుగా ఊహించినట్టు జిల్లా అంతటా చేతులెత్తే పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించారు. చాలాచోట్ల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. వైసిపి బహిష్కరించడంతో ఎన్నికలు ఏకపక్షంగా మారాయి. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 154 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1242 టెరిటోరియల్ స్థానాలకు గాను 1194 స్థానాలకు ఎన్నికలు జరిగినట్టు అధికారులు ప్రకటించారు. ఇంకా 48 స్థానాలకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇన్‌ఛార్జి ఎస్‌ఇ పులిపాటి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి ప్రాదేశిక సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించారు. అయితే మొత్తం 154 సంఘాలకు గాను 106 సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలను నిర్వహించారు. ఈనెల 17న నీటి సంఘాల అధ్యక్షులు

యడ్లపాడు మండలం జాలాది సాగునీటి సంఘం

డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారని ఎస్‌ఈ పులిపాటి వెంకటరత్నం తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో మొత్తం 274 సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఒక్కో నీటి సంఘం పరిధిలో 12 టెరిటోరియల్ స్థానాలు మొత్తం 2628 ఉండగా 2500 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. అలాగే శనివారం రాత్రి 10 గంటలకు అందిన సమాచారం ప్రకారం 220 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఈనెల 17న ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో రైతులు, కౌలు రైతుల జాబితాలలో చాలా మంది పేర్లు లేవని ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని స్థానాలను బిజెపి, జనసేనకు కూడా కేటాయించారు.

11వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 11 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను ఏఐఎఫ్టియు న్యా నాయ కులు కొరపాటి కోటేశ్వరరావు, స్టీరింగ్ కమిటీ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో ఎండి ఇస్మాయిల్, దర్శి అబ్రహం, డేరంగుల రమణ, దర్శి పాల్, కంచర్ల సీత కూర్చున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయమైన కార్మికుల సమస్య ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. పైసా ఖర్చు లేకుండా ఇటువంటి సమస్యలు పరిష్కా రం అయితే కొన్ని కుటుంబాలు రుణపడి ఉంటాయని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చొరవకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి అంకయ్య, ఎం ఆశీర్వాదం, కే ఆదినారాయణ, వై నాగేశ్వర రావు, బి సూర్య ప్రకాష్, ఎస్ కే భాష, ఎండి రహీముల్లా, ఎస్ కే ఇమాంబి, వై రమాదేవి, దుర్గ భవాని, సారమ్మ, నాగమల్లేశ్వరి, రమణ, బుజ్జి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ని కలిసిన బాలోత్సవం ప్రతినిధులు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ప్రతినిధులు శనివారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఎంటిఎంసి బాలోత్సవం మూడో పిల్లల పండుగను ప్రారంభోత్సవానికి మంత్రిని ఆహ్వానించారు. తప్పకుండా వస్తానని లోకేష్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఆ మెరకు తన రాజకీయ వ్యవహారాలను చూసే పీఏకు బాధ్యత అప్పగించి తేదీ, సమయం రికార్డ్ చేయించారు. లోకేష్ ను కలిసిన వారిలో రాష్ట్ర బాలోత్సవాల బాధ్యులు పిన్నమనేని మురళీకష్ణ, బాలోత్సవం ప్రతినిధులు జివిస్సార్ మోహన్రావు, మంగళగిరి సిటీ కేబుల్ ఎండి రావూరిరమేష్ బాబు, స్టార్ వైట్ అధినేత ఎస్.శ్రీనివాసరావు, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడ్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 11 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్టు డిఎస్‌పి అబ్దుల్ అజీజ్ తెలిపారు. గుంటూరులోని కొత్తపేట పోలీసు స్టేషన్‌లో శని వారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వాహనాలను దొంగిలిస్తున్న పిడుగురాళ్లకు చెందిన పరికల సాగర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వివరాలు బయటకు వచ్చాయాన్నరు. ఇతను గుంటూరు శ్రీనివాసరావు పేటలో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.10.50 లక్షలుగా ఆయన వివరించారు. సిఐ సోమయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు కోడిపుంజు

ఉండవల్లిలో సంక్రాంతికి ముందే కొక్కొరొకో

ప్రజాశక్తి-తాడేపల్లి

పెద్ద పండగ సంక్రాంతి నెలబట్టారు. ఈ పండుగ అంటేనే గుర్తొచ్చేది కోడిపందేలు. రాజధాని ఉండవల్లిలో కొక్కొరొకో ముందే అరిసింది. గుట్టుచప్పుడు కాకుండా సీఎం నివాసం ఉంటున్న సమీపంలో కోడి పందాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు దాడి ముందుగానే వసిగట్టిన పందాల రాయుళ్లు తను వెంట తీసుకొచ్చిన ద్విచక్ర వాహనాలతో సహా పారిపోయారు. పోలీసుల ప్రాం తానికి చేరుకొని దొరికిన కోడిపుంజును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కష్టంలో గుర్తొచ్చేది కమ్యూనిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టమేనన్నారు. ఒకేదేశం ఒకేఎన్నిక ఒకేపార్టీ పేరుతో రాజకీయంగా లబ్ధి పొందడానికి బిజెపి చేస్తున్న కుట్రలో ప్రాంతీయ పార్టీలు కూడా చిక్కుకుంటున్నాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి బిజెపి ఆటంకంగా మారిందన్నారు. బిజెపి హయాంలో ఆదాని, అంబాని తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. గత ఎన్నికల్లో బిజెపికి 400 సీట్లు వస్తే ఈపాటికి రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చివేసే వారన్నారు. రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి బిజెపి కుట్ర పన్నుతోందన్నారు. అదానీకి పోర్టులు, ఎయిర్‌పోర్టులు, విద్యుత్ ప్లాంట్లు అప్పగిస్తున్నారని, సామాన్యులపై పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. స్మార్టు మీటర్ల వల్ల వినియోగదారులకు తీవ్ర నష్టమని, వీటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విద్యుత్ వినియోగంపై ఉదయం ఒక రేటు, రాత్రికి ఒక రేటు చొప్పున వసూలు చేస్తారని తెలిపారు. సెల్‌ఫోన్ వినియోగం మాదిరిగా రిఛార్జి చేసుకున్న వారికే విద్యుత్ సరఫరా

జెండా ఆవిష్కరణ

హాజరైన ప్రతినిధులు

కళాకారుల గేయాలాపన

చేస్తారని చెప్పారు. 2022లో వినియోగించుకున్న విద్యుత్‌కు 2024లో సొమ్ము వసూలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు 2000 సంవత్సరంలో నిర్వహించిన విద్యుత్ ఉద్యమం మాదిరిగా మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టాలన్నారు. తద్వారా ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాలలో 60 వేల ఎకరాలకు సాగునీరు, 60 గ్రామాలకు త్రాగునీరు లభిస్తుందన్నారు. పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ పూర్తయితే 4 మండలాలలో 26 వేల ఎకరాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించకపోవటం వలన ఈ పథకం అర్థాంతరంగా ఆగిపోయిందన్నారు. గుంటూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, వీలీన గ్రామాల్లో మౌలిక వసతులు పెంచాలన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఆర్‌వోబిలు నిర్మించే ముందు స్థానికంగా ఉన్న ప్రజలతో మాట్లాడాలని, అందువల్ల నష్టపోయే వారిని ఆదుకోవాలన్నారు. నగరంలో పి.వి.కె నాయుడు కూరగాయల మార్కెట్‌ను నిర్మించి, చిన్న వ్యాపారులకు న్యాయం చేయాలన్నారు. బృందావన్ గార్డెన్స్‌లో అసంపూర్తిగా ఉన్న నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం పూర్తి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి కొనసాగాలని, 29 గ్రామాలలో భూ సమీకరణ ద్వారా 33 వేల ఎకరాలు యిచ్చిన రైతాంగానికి మొదట న్యాయం చేయాలన్నారు. భూములను అభివద్ధి చేసి, రైతులకు వాణిజ్య, నివాస ప్లాట్లను కేటాయించాలి. రాజధానిలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు భూముల కేటాయింపులో తొలి ప్రాధాన్యత యివ్వాలన్నారు. రాజధాని ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, చిన్న రైతులకు న్యాయం చేయాలన్నారు. రాజధాని నిర్మాణం బాధ్యతను కేంద్రం తీసుకోవాలని ఇందుకు అనుగుణంగా నిధులను కేంద్రం ఇవ్వాలన్నారు. మంగళగిరి, తాడేపల్లి జిల్లాలో కొన్ని ప్రాంతాలలో ప్రజలు అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో ఇళ్ళు వేసుకొని అనేక సంవత్సరాలుగా నివశిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతిలో ప్రభుత్వం 'స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయాలన్నారు. రాజధాని ప్రాంతమైన తుళ్లూరులో, తెనాలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు నూతన కోర్సులతో ఏర్పాటు చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య రంగంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని కార్మికశాఖకు చెందిన 7 ఎకరాలలో విస్తరించాలన్నారు. మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో సౌకర్యాలు పెంచాలని, ఎయిమ్స్ హాస్పిటల్‌కు నీటి సరఫరా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మంగళగిరిలో ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ రక్షణకు, చేనేత కార్మికుల కోసం చర్యలు చేపట్టాలని, మంగళగిరి ప్రాంతంలో ఐ.టి. రంగ పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని కోరారు. మిర్చి యార్డుకు అనుబంధంగా 'మిర్చి ఎక్స్‌పోర్ట్ జోన్' ఏర్పాటు చేయాలన్నారు. గుంటూరు నగరంలో క్రైస్తవుల సమాధుల కోసం భూమి కేటాయించ లేదన్నారు. తెనాలి, కొల్లిపర మొదలగు ప్రాంతాలలో గ్రామాలలో దళితులకు శ్మశానాలు లేవని శ్మశానాలకు ప్రత్యేకంగా స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

దేశంలోనే కేరళ ముందజ

(మొదటిపేజీ తరువాయి)

పట్టణం వినుకొండ రోడ్డులోని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద శనివారం కేరళ సంఘీభావ సభ నిర్వహించారు. సభకు సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడుతూ కేరళలో వామపక్ష ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తూ ప్రజల ద్వారా ప్రజాపాలన సాగిస్తోందని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక అన్ని రంగాల్లో కేరళ ప్రభుత్వం అభివృద్ధిని సాధించి ప్రజలకు ఉపయోగపడేలా వ్యవహరిస్తుందని చెప్పారు. అన్ని సూచికల్లో కేరళ ప్రభుత్వం మార్గదర్శకంగా ఉండడాన్ని ఓర్వలేని మోడీ ఆ రాష్ట్రంపై కక్షగట్టి గత 5 ఏళ్లలో కేరళకు ఇవ్వాల్సిన రూ.లక్ష కోట్లను ఇవ్వకుండా అక్కడ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, అస్థిరపర్చేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేరళలో అమలు చేయడంతో రైతుల ఆత్మహత్యలు లేవని, వ్యవసాయ అభివృద్ధి 2 నుండి 4.64 శాతానికి పెరిగిందని, వరిసాగు 1.7 లక్షల హెక్టార్ల నుండి 2.5 లక్షల హెక్టార్లకు పెరిగిందని, కూరగాయల సాగు 60 వేల హెక్టార్ల నుండి 1.2 లక్షల హెక్టార్లకు పెరిగిందని వివరించారు. వ్యవసాయ కార్మికులకు, రైతులకు ప్రయోజనం కలిగించే సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం చేసిందని, ప్రతి గ్రామీణ కుటుంబానికి సాగు భూమి లక్ష్యంతో 'నవ కేరళ' పని చేస్తోందని తెలిపారు. లైఫ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 4.5 లక్షల గృహాల నిర్మాణంతో వాయనాడ్ బాధితులకు స్వయంగా ప్రభుత్వమే 35 వేల ఇల్లు నిర్మించి ఇచ్చిందని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా 60 లక్షల కుటుంబాలకు చట్టపర పెన్షన్ పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. ఇక్కడ కూటమి ప్రభుత్వం ధాన్యం క్వింటాళ్‌కు రూ.2,183 మాత్రమే ప్రకటించగా కేరళ ప్రభుత్వం రూ. 2,800 ఇస్తోదన్నారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ ప్రపంచంలో ఇతర దేశాలతో అభివృద్ధిలో కేరళ రాష్ట్రం పోటీ పడుతోందని, దేశంలో మతసామరస్యాన్ని కాపాడడంలో కూడా కేరళ రాష్ట్రంలో ముందుందని అన్నారు. ప్రధాని మోడీ నకిలీ దేశభక్తి ప్రదర్శిస్తూ ఫెడరలిజంపై దాడి చేస్తున్నారన్నారు. 41 ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని అడ్డుకొని కేరళ ప్రభుత్వం లాభాల్లోకి తెచ్చిందని, ఐదేళ్లలో 1.40 లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రాష్ట్రంలో ప్రారంభమయ్యాయని తెలిపారు. 16 రకాల సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి సమర్ధవంతంగా నిర్వహిస్తోందని, రేషన్ షాపుల ద్వారా 16 రకాల సరుకులను చౌకగా 85 శాతం ప్రజలకు సమర్ధవంతంగా సరఫరా చేస్తోందని తెలిపారు. నీతి అయోగ్ ప్రకారం గుజరాత్‌లో అధికంగా 17 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉంటే కేరళలో అది 0.7 శాతం మాత్రమేన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్న 10 లక్షల ఖాళీలను మోడీ ప్రభుత్వం భర్తీ చేయలేదని, కేరళలో ప్రభుత్వ శాఖలో 2.28 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేసిందని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టి 100 రోజులు ఉపాధి కల్పించి రాష్ట్ర బడ్జెట్ నుండే ఖర్చు చేస్తోందని తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని జిల్లా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చిందని 'కుటుంబశ్రీ' పథకం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని అన్నారు. వలస కార్మికులకు కేరళ ప్రభుత్వం అతిథులుగా చూస్తోందని, రేషన్ కార్డు మంజూరు చేసి పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాన్ని కల్పిస్తోందని తెలిపారు. రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ, బలమైన సహకార వ్యవస్థ అన్ని రంగాల్లో సహకార సంఘాలు పని పనిచేయడంతో కో-ఆపరేటివ్ బ్యాంకులు వాణిజ్య బ్యాంకులకు దీటుగా నడుస్తున్నాయన్నారు. ఇటువంటి ప్రత్యామ్నాయ విధానాలను సహించలేకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేరళపై కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, నాయకులు షేక్ సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి విజయ్ కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, వివిధ సంఘాల నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు, కె.రామారావు, కె.ఆంజనేయులు, నాగమ్మ భాయ్, నిర్మల, విజయలక్ష్మి, సుభాష్ చంద్రబోస్, మస్తాన్‌వలి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా చేపట్టిన అభివద్ధి పనులను నిర్దేశిత గడవు మేరకు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తిచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ కష్ణనగర్, స్తంభాల గరువు, పట్టాభిపురం ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివద్ధి పనుల్లో భాగంగా చేపట్టే రోడ్ల నిర్మాణం డ్రైన్ టు డ్రైన్ చేయాలని, డ్రైన్లను లెవల్ సరిగా ఉండేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. డ్రైన్ల మీద నిర్మాణం చేసే కల్వర్ట్‌ల వద్ద మురుగు పారుదల సక్రమంగా ఉండడంలేదని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైన్ల నిర్మాణం అనంతరం డెబ్రిస్‌ని తొలగించాలని, సచివాలయాల వారీగా ఎక్కడైనా రోడ్లు ప్యాచ్‌వర్క్ చేయాలని గుర్తిస్తే ఎప్పటికప్పుడు చేపట్టాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ నుండి ఎన్టీఆర్ స్టేడియం వరకు రోడ్లకు ఇరువైపులా డ్రైన్ నిర్మాణం చేయాలని, ఆక్రమణదారులకు నోటీసులు అందించి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలియచే యాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పట్టాభిపురం మెయిన్‌రోడ్ నుండి డిఆర్ఎం ఆఫీస్ వరకు రోడ్, డ్రైన్,

రెండు కార్లు ఢీకొని చిన్నారి దుర్మరణం

కుటుంబ సభ్యులకు గాయాలు

ప్రజాశక్తి-ఈపూరు

ఎదురెదురు రెండు కార్లు వేగంగా ఢీకొన్న ప్రమాదంలో పాప మృతి చెందగా కుటుంబ సభ్యులు గాయపడిన సంఘటన కూచినపల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్న ఆళ్ల బ్రహ్మారెడ్డి భార్య లక్ష్మీ దుర్గ, కుమారుడు విశ్రుద్ రెడ్డి, కుమార్తె తాపస ఆరాధ్య, చెల్లెలు ప్రవళిక తో కలిసి ఉదయం కారులో స్వగ్రామం వినుకొండ మండలం చాటగడ్డపాడు గ్రామంలో ఈ నెల 16న జరగ నున్న తమ్ముడు ఆళ్ల గురువారెడ్డి కుమారుడు అన్నప్రాసన కార్యక్రమానికి బయలుదేరాడు. వినుకొండ-కారంపూడి రోడ్డులో కారు కూచినపల్లి వద్దకు రాగానే ఈపూరు నుండి కారంపూడి వైపు వెళుతున్న కారు బ్రహ్మారెడ్డి కారును ఎదురుగా వేగంగా ఢీకొట్టడంతో రెండు కార్లు ముందు భాగాలు నుజ్జు నుజ్జవటంతో పాటు బ్రహ్మారెడ్డి కారు ముందు భాగంలో మంటలు చెలరేగాయి. పెద్ద శబ్దంతో కూచినపల్లి గ్రామస్తులు ప్రమాద స్థలానికి చేరుకొని కారు అద్దాలను పగలగొట్టి కారులోని వారిని బయటికి తీశారు. ప్రమాదంలో లక్ష్మీదుర్గ, ప్రవళిక కుడి కాలికి తీవ్ర గాయాలు కాగా తాపస ఆరాధ్య (14 నెలలు) స్పృహ కోల్పోవడంతో వెంటనే క్షతగాత్రులను ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తాపస ఆరాధ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బ్రహ్మారెడ్డి, కుమారుడు విశ్రుద్ రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం లక్ష్మీ దుర్గ, ప్రవళికను నరసరావుపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పాప మృతిని జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు,బంధువుల రోదనలతో ఆస్పత్రి ఆవరణంలో మిన్నంటాయి. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎస్ఐఎం ఉమామహేశ్వరరావు సందర్శించారు. బ్రహ్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతి చెందిన 14నెలల చిన్నారి

క్షతగాత్రులు

గౌరవనీయులైన శ్రీ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసరావుపేట..
ఐపి నెం. 43/2024

Between:
చిమటా సాంబశివరావు ...వాది
V/S
1)ముచ్చుమూరి సుబ్బారెడ్డి మరియు ఇతరులు ......ప్రతివాదులు

1) ముచ్చుమూరి సుబ్బారెడ్డి S/o వెంకట సుబ్బారెడ్డి, నివాసము డోర్ నెం. 3-2,
2) మన్నం శివరామిరెడ్డి S/o నాగార్జునరెడ్డి, నివాసము డోర్ నెం. 3-35,
3) మోరం శ్రీనివాసరెడ్డి S/o బాలసుబ్బారెడ్డి, నివాసము డోర్ నెం. 3-45,
4) మోరం బాలసుబ్బారెడ్డి S/o రామిరెడ్డి, నివాసము డోర్ నెం. 3-45,
5) ముచ్చుమూరి శ్రీనివాసరెడ్డి S/o చిన్నకామారెడ్డి, నివాసము డోర్ నెం. 3-65,
6) కొర్రపాటి జగన్నాథం S/o వెంకటేశ్వర్లు నివాసము డోర్ నెం. 3-85,
7) తోకల సీతామహాలక్ష్మి W/o శ్రీనివాసరావు, నివాసము డోర్ నెం. 3-41,
8) చిన్నపరెడ్డి నరేంద్రరెడ్డి S/o గురవారెడ్డి, నివాసము డోర్ నెం. 3-61,
9) జెక్కిరెడ్డి లక్ష్మారెడ్డి S/o చెంచిరెడ్డి, నివాసము డోర్ నెం. 3-91,
10) పోతంబోయిన నాగరాజు S/oనాగేశ్వరరావు, నివాసము డోర్ నెం. 3-84,
11) పోతంబోయిన చంద్రరావు S/oనాగేశ్వరరావు, నివాసము డోర్ నెం. 3-84,
12) బెజ్జంకి సాంబయ్య S/o కర్రబ్బాయి, నివాసము డోర్ నెం. 3-80,
13) కాంపల్లి కొండలు S/o రామారావు, నివాసము డోర్ నెం. 3-91,
14) పోట్లూరి చిన్నసుబ్బారెడ్డి S/o చిన్నకోటయ్య, నివాసము డోర్ నెం. 3-97,
15) బండారుపల్లి పట్టాభి S/o సోమలింగయ్య, నివాసము డోర్ నెం. 3-82,
16) పేరం పెద్దమ్మాయి W/o రామయ్య, నివాసము డోర్ నెం. 3-18,
17) కొల్లూరి అంబారావు S/o హనుంతరావు, నివాసము డోర్ నెం. 3-99,
18) చిమటా శ్రీనివాసరావు S/o యల్లమంద, నివాసము డోర్ నెం. 3-35,
నెం. 1 to 18వారల నివాసము దొండపాడు గ్రామం, (దొండపాడు అగ్రహారం), నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
19) కిష్టిపాటి సాంబిరెడ్డి S/o వెంకటరెడ్డి, నివాసము డోర్ నెం. 2-18, లంకెలకూరపాడు గ్రామము, జి. ముప్పాళ్ళ మండలం, పల్నాడు జిల్లా.
20) చిమటా మాధవరావు S/o బాలకోటి, నివాసము డోర్ నెం. 2-35, మాదల గ్రామము, ముప్పాళ్ళ మండలం, పల్నాడు జిల్లా.
21) అంగిరేకుల అనిల్ S/o వెంకట్రాది, నివాసము డోర్ నెం. 1-95, పమిడిపాడు గ్రామము, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
22) మున్నం చౌడయ్య S/o రంగారావు, నివాసము డోర్ నెం. 3-35, రెంటచింతల గ్రామము & మండలం, పల్నాడు జిల్లా.
23) ఆలా పుల్లారావు S/o పెద్ద వెంకటేశ్వర్లు, నివాసము డోర్ నెం. 3-1, అనుపాలెం గ్రామము, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా.
24) చిమటా వెంకటేశ్వర్లు S/o పిచ్చయ్య, నివాసము డోర్ నెం. 4-1, బుచ్చిపాపన్నపాలెం గ్రామము, రొంపిచర్ల మండలం, పల్నాడు జిల్లా.
25) బండారుపల్లి సాంబయ్య S/o రామయ్య, నివాసము డోర్ నెం. 6-5, సాతులూరు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా.
26) తోకల రామకోటి S/o బుడ్డవెంకయ్య, నివాసము డోర్ నెం. 3-65, సాతులూరు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా.
27) గంగవల్లి నరసింహారావు S/oలక్ష్మీకోటయ్య, నివాసము డోర్ నెం. 2-55, సాతులూరు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా.
..... రెస్పాండెంట్స్

సదరు పై నెంబరు దావాలోని పిటీషనరు తనను ఇన్సాల్వెంటుగా ప్రకటించమని ఇందలి ప్రతివాదులపై ఐ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఐ.పి.లో ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ఐ.పి. దావాలో చూపిన ప్రతివాదులు కాకుండా ఇంకా ఇతరులు ఎవరైనా ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట ది. 27-12-2024 న ఉదయం 10-30 ని.లకు హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోగలరు. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు:
వాయిదా ది. 27-12-2024.
కె. సీతారామాంజనేయులు,
బి. గోపిరాజు
వాది తరుపు న్యాయవాదులు, నరసరావుపేట.
సెల్ నెం.9390511530

ఘనంగా హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. వివిధ సంవత్సరాలలో చదువుకున్న దాదాపుగా 400 మంది పూర్వ విద్యార్థులు హాజరై ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ముఖ్యఅతిథిగా హిందూపూర్ పార్లమెంట్ సభ్యులు అంబికా జి.లక్ష్మీనారాయణ వాల్మీకి విచ్చేసి తన ఎదుగుదలకు హిందూ కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం ఎంతో దోహదపడ్డారని తెలియజేశారు. అలాగే అందరూ కూడా సామాజిక స్పృహ కలిగి ఉండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలియజేశారు. జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారి డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు విద్యార్థులు ఆది నుంచి ఒక లక్ష్యంతో కషిచేస్తే ఉన్నత శిఖరాలు చేరుకోగలరని తెలిపారు. విజువల్ ఆర్టిస్ట్ ఆదర్శ బాజీ తను కళారంగంలో ఈ స్థాయికి ఎదగడానికి గల కారణం హిందూ కళాశాల సమితి తనకు ఎంతో దోహద పడిందని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ టి.నాగేశ్వరరావు, డాక్టర్ డి.నాగేశ్వరరావు, డాక్టర్ ఎ .సుబ్రమణ్యంను నిర్వాహకులు సన్మానించారు. చదువులలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు పొదిలి, బెల్లంకొండ అవార్డులను ప్రకటించారు.కార్యక్రమానికి మాజేటి సోమశేఖర్ అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ కళాశాలలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి నివేదికను కెవిఎస్ దుర్గాప్రసాద్ సమర్పించారు.కార్యక్రమంలో డాక్టర్ వై.గౌరీ శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపి లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న మాజేటి సోమశేఖర్ తదితరులు

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
LA.NO.217/2024 IN
DISPUTE NO.21/2024

Between:
M/S MARGADARSI CHIT FUND (P) LTD., NARASARAOPET REP BY ITS FOREMAN/BR.MANAGER
...PETITIONER/DISPUTANT
AND
MR.CH.RAMESH AND OTHERS
.... RESPONDENTS/OPPONENTS

To
RESPONDENT/OPPONENT NO:1.
MR.CHINTHA RAMESH, S/O.CH.LINGAIAH, PROP.M/S.RAMKY TRADERS, D.NO.1-102, MAIN ROAD, MUNDRUVARI PALEM (V). CHINAKANCHERLA (P), SAVALYAPURAM (M), PALNADU DIST. R/O.D.NO.3-238, CHINAKANCHERLA (P), SAVALYAPURAM (M), PALNADU DIST

పై నెంబరులో మీరు Respondent/Opp No.1 అయి ఉన్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పై నెంబరులో శ్రీ కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు పంపినను మీరు బుద్ధి పూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టు వారు మీకు పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కనుక పై నెంబరు పిటిషన్ (IA.217/2024) ది. 4-01-2025 న వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు గానీ వకీలు గారి ద్వారా గానీ పైకోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరులో మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనవలెను లేని యెడల మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS, NARASARAOPET)
G.V.SUBRAHMANYAM
ADVOCATE FOR DISPUTANT

IN THE COURT OF THE PRL CIVIL JUDGE (JUNIOR DIVISION) COURT AT TENALI
EP No.140/2022 IN
DISPUTE NO.82/2018

BETWEEN:
M/S.MARGADARSI CHIT FUND (P) LTD., NARASARAOPET. REP BY ITS MANAGER .... DECREE HOLDER
AND
MR.V.VENKATESWARA RAO AND OTHERS ... JDRS

TO
JDR NO.6
DR. DAVULURI RAVI BABU, S/O.CHRISTOPHER, R/O.FLAT NO.405, 5TH FLOOR, VIJAYASAI RESIDENCY, GOVT HOSPITAL ROAD, CHENCHUPET, TENALI GUNTUR DISTRICT.

పై నెంబర్ లోని Decree Holder తమ యొక్క Schedule దాఖలు property ని వేలం చేయుట మూలకంగా Decree బాకీ వసూలుకై పై నెంబరున అమలు దాఖలా చేసి మీకు కోర్టు వారు కోర్టు ద్వారా రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్ని పర్యాయములు order 21 Rule 66 నోటీసులు పంపించిననూ బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు పై నెంబర్ లో మీకు పేపర్ ప్రకటన ద్వారా నోటీసుకు ఉత్తర్వులు ఇచ్చినందున పై నెంబరు వ్యాజ్యము ది. 8-01-2025 తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా తేదీన పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ అడ్వకేట్ ద్వారా గానీ ఉదయం 10:30 ని.లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షము నందు తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా తేదీ. 8-01-2025
BMS DURGA PRASAD
ADVOCATE FOR DHR

1350 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి నుంచి గంజాయిని, రూ 6 లక్షల విలువ చేసే ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని 1వ పట్టణ సిఐ చరణ్, ఎస్ ఐ వంశీ కృష్ణ శనివారం తెలిపారు. నరసరావుపేట పట్టణం వరవకట్టకు చెందిన షేక్. అష్రాఫ్ మరో ఇద్దరు వ్యక్తులతో విశాఖపట్నం నుంచి గంజాయి రవాణా చేసి విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం పట్టణం లోని మున్సిపల్ అతిథి గృహం వద్ద అంధుల పాఠశాల సమీపంలో పోలీసులు కాపుకాసి చాకచక్యంగా అష్రాఫ్ ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 1350 గ్రాముల గంజాయి 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని సిఐ ఎంవి చరణ్ తెలిపారు. సదరు అష్రాఫ్ ను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన సిఐ ఎంవి చరణ్, ఎస్ ఐ పి. వంశీ కృష్ణ, కానిస్టేబుల్స్ వీరాంజనేయులు, రాజేష్, కోటేశ్వర రావు, పాండు రంగారావు, బాబులను డి.ఎస్.పి నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.

600 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక వాసవినగర్‌లో బొమ్మరిల్లు అపార్టుమెంట్స్‌లో ముగ్గురు వ్యక్తుల నుంచి 600 గ్రాముల గంజాయిని ఎక్సైజ్ అధికారులు శనివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. అధికారుల కథనం ప్రకారం అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన వేమవరపు ప్రేమకుమార్, విశాఖ జిల్లా పాడేరుకు వెళ్ళి గంజాయిని తీసుకుని వచ్చాడు. తన స్నేహితులు అయిన పరమాయగుంట లోని అరుంధతి నగర్ కి చెందిన గున్నం యాస్వంత్ సాయిరాం, మంగళదాస్ నగర్ లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గొట్టిముక్కల సుమంత్‌తో కలసి విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు గంజాయి ని చిన్న చిన్న పాకెట్లలో కట్టి పాకెట్ రూ. 500 విక్రయిస్తుంటారని తెలిపారు. వన్‌టవున్ సిఐ లత, ఎస్ఐ మొహ్మద్ ఖాసీం షరీఫ్, సిబ్బంది బసవేశ్వరరావు, పూర్ణచంద్రరావు, సంధ్య,మస్తాన్ వలి దాడిలో పాల్గొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ లత తెలిపారు.

NOTICE
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
DISPUTE NO.44/2023

Between:
M/S.MARGADARSI CHIT FUND (P) LTD., NARASARAOPET. REP BY ITS FOREMAN/BR.MANAGER ... DISPUTANT
AND
MR.S.A.LENIN BABU AND OTHERS
... OPPONENTS

TO
OPPONENT NO:7. Mrs.S.Seetha Devi, W/o.Late.S.Ankamma Chowdary, R/o.D.No.Santhi Nagar, Near sai Baba Temple, Ramulavari Temple Road, Beside S.R.Industries, Ganapavaram, Nadendla (m), Palnadu Dist.

Please take notice that the above dispute is filed against Opponent No.7 of you and 6 others for recovery of Rs.2,80,317/- (Rupees TWO LAKHS EIGHTY THOUSAND THREE HUNDRED AND SEVENTEEN ONLY) and the same is posted to 4-01-2025 for the appearance of you i.e., Opponent No.7 before the Deputy Registrar of Chits, Narasaraopet, O/o. District Registrar, Narasaraopet at 10.30 A.M., if you failed to attend the O/o.Deputy Registrar of Chits, on that day the matter will be heard and decided exparte basis on the material available.

(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS, NARASARAOPET)
G.V.SUBRAHMANYAM
ADVOCATE FOR DISPUTANT

దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన పట్టణంలోని రైలుగేటు సమీపంలో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణానికి చెందిన దుర్గా రెడ్డి బైక్‌పై వస్తూండగా పట్టణానికి చెందిన కొమెర శివనాగరాజు, అతని సోదరుడు, మరో నలుగురు అటకాయించి నాటుకర్రతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో దుర్గారెడ్డికి తీవ్రగాయాలు అయ్యాయి. శివనాగరాజు తాను కలిసే తిరిగేవారమని, అతనికి, తనకు ఎటువంటి గొడవలు లేవని దుర్గారెడ్డి చెప్పారు. దెబ్బలు తప్పించుకుని పారిపోయే సమయంలో మొన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిని కలసాడు, వీడిని వదిలిపెట్టద్దని అన్నారని చెప్పాడు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో చేరగా, వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి నర్సరావుపేట వైద్యశాలకు రిఫర్ చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీరాం శ్రీనివాస కళ్యాణ్

లోక్ అదాలత్‌లో 227 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- మాచర్ల

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించకోవటం వల్ల తక్షణ ఉపశమనంతో బాటు సమయం, ఖర్చులు తగ్గుతాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీరాం శ్రీనివాస కళ్యాణ్ అన్నారు. శనివారం పట్టణంలోని జూనియల్ సివిల్ కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వివిధ కేసుల్లో ఇరు పక్షాల కక్షిదారులు రాజీ పడటంతో 227 కేసులు పరిష్కారమయ్యాయి. సివిల్ కేసులు-10, ఈపిలు-3, మనోవర్తీ కేసులు -3, క్రిమినల్ కేసులు-57, ఎక్సైజ్ కేసులు-35, బ్యాంకు కేసులు-2, టెలిఫోను-3, ఇతర కేసులు-114 మొత్తం 227 కేసులు పరిష్కారం అయ్యాయి. దీనిద్వారా కక్షిదారులకు రూ.52,37,821 లబ్ధి చేకూరినట్లయింది. కార్యక్రమంలో న్యాయవాదులు వివివి పుల్లారావు, గట్లా సత్యనారాయణరెడ్డి, కేళం శ్రీనివాసరావు, బాలజోజి, షేక్ గాలిబ్ సాహెబ్, వై. కృష్ణమూర్తి, జి.వరప్రసాదరావు, బి.అనీల్, షేక్ జానీ, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

వాగ్దేవి డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శనివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు వారికి ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడల ద్వారానే మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం పెరుగుతందని చెప్పారు. క్రీడల్లో చురుగ్గా ఉన్నవారు చదువుతోపాటు ఇతర విషయాల్లోనూ చురుగ్గా ఉంటారని, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ సదుపాయం ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి, పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం రాయల శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, ఓగూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించే వరకూ పోరాటం

- స్మార్ట్ మీటర్లను పెడితే ఇళ్లల్లో చీకటే
- సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- విద్యుత్ బిల్లు ప్రతుల దహనం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమని, స్మార్ట్ మీటర్లు పెట్టడం అక్రమమని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 19న పట్టణంలో నిరసన ప్రదర్శన, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక పుతుంబాక భవన్లో విద్యుత్ ఛార్జీలు స్మార్ట్ మీటర్లు సమస్యలపై అన్ని రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల అధ్యక్షత వహించగా సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు అశోక్, డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగం చిట్టిబాబు, సిపిఐ నాయకులు ఇర్మియా మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమాన్ని అడ్డుకోవాలని, స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని క్షేత్రస్థాయిలో ప్రజానీకానికి అవగాహన కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ చార్జీలు పెంచడం వలన ప్రజానీకం విసిగి వేసారి ఉన్నారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తూ రూ.18 వేల కోట్ల విద్యుత్ భారాలను వేయడం సరికాదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులందరినీ ఐక్యం చేసి ఈనెల 19న జరిగే ప్రదర్శన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు జె.రాజ్‌కుమార్, జి.బాలకృష్ణ, పి.ప్రభాకర్, షేక్ సైదులు, పి.సూర్యప్రకాశరావు, జి.రజిని, జి.ఉమశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని 8వ వార్డులో పర్యటించి విద్యుత్ వినియోగదారులను సందర్శించారు. ఈ సందర్భంగా అధికంగా విద్యుత్ బిల్లులు వచ్చిన విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను తీసుకువచ్చి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ విద్యుత్తు ఛార్జీలు తగ్గించే వరకు స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకునే వరకు సిపిఎం ఉద్యమిస్తుందని అన్నారు. స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తే పెరిగిన ఛార్జీలు

ప్రకారం రీఛార్జి చేయించుకోవాల్సి వస్తుందని, బ్యాలెన్స్ అయిపోతే కరెంటు అకస్మాత్తుగా సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. స్మార్ట్ మీటర్లు వినియోగదారుల పాలిట శాపమన్నారు. ఈ మొత్తం కాంట్రాక్టు అదాని కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారని, ఈ మొత్తం లక్షలాది కోట్ల రూపాయల ప్రజా సంపదను అదానికి కట్టబెట్టేందుకు కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో సిఎం చంద్రబాబు యత్నిస్తున్నారని అన్నారు. ఈ వినాశకర విధానాలపై సిపిఎం పోరాడుతుందని, ప్రజలంతా కలిసి రావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె.రాజకుమార్, షేక్ మస్తాన్‌వలి, ఆర్.పురుషోత్తం, జి.హనుమంతరావు, కె.జగన్, స్థానికులు పాల్గొన్నారు.

కాల్చొద్దు.. కలియ దున్నండి..

ప్రజాశక్తి - కారంపూడి

మండల పరిధిలో చాలాచోట్ల వరికోతలు పూర్తయ్యాక రైతులకు వరి కొయ్యాలను కాలుస్తున్నారు. వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తుండటంతో గడ్డి వినియోగం తగ్గిపోయింది. పశుసంపద ఉన్న వారు గడ్డిని సేకరిస్తుండగా మిగతా వారు పొలంలోనే వదిలేస్తున్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధంచేసే క్రమంలో వరి కొయ్యలతో పాటు, గడ్డినీ దహనం చేస్తున్నారు. దీనివల్ల భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిప్పు పెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతోపాటు విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గి పోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగిసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కోసారి బుగ్గిపాలవుతున్నాయి. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, వరి కళ్లాలు దగ్గరే ఉంటే ధాన్యం కాలిపోయే ప్రమాదం ఉంది.

వరి గడ్డిని భూమిలో కలియ దున్నితే ఎన్నో ప్రయోజనాలు వుంటాయి. సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది. జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియంలాంటి సూక్ష్మధాతువులు అంది పంటకు మేలు చేకూర్చుతాయి. నేలలో కరుగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది. టన్ను గడ్డి కావాలంటే వరి పెరుగుదలకు 18.9 కిలోల పొటాషియం, 62 కిలోల నత్రజని,11కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరం అవుతాయి. కొయ్యకళ్లను దున్నితే పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి. పొలం దున్నే పది రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్పేట్ చల్లాలి. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచవచ్చని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

స్కూల్ గేమ్స్ అండర్-19 బాల బాలికల రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు మండలంలోని ధూళిపాళ్ల లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి లయోలా కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గుంటూరు జిల్లా డివిఇఒ జె.పద్మ, గుంటూరు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ టి.వెంకటేష్ యాదవ్, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకర్, గవర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శివరామకృష్ణ, పిఇటిలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాలుర లీగ్ మ్యాచ్ ఫలితాలు

తూర్పుగోదావరి జిల్లా జట్టుపై నెల్లూరు జిల్లా జట్టు 6-2 పాయింట్లు తేడాతో విజయం సాధించింది. ప్రకాశం జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 6-0 పాయింట్లతో, చిత్తూరు జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా జట్టు 7-1 పాయింట్లతో, కృష్ణా జిల్లా జట్టుపై విజయనగరం జిల్లా జట్టు 7-6 విజయం సాధించాయి.

బాలికల లీగ్ మ్యాచ్ ఫలితాలు

కృష్ణా జిల్లా జట్టుపై విజయనగరం జిల్లాజట్టు 7-6 పాయింట్లతో గెలుపొందింది. కర్నూలు జిల్లా జట్టుపై పశ్చిమగోదావరి జిల్లా 9-8 పాయింట్లతో, ప్రకాశం జిల్లా జట్టుపై శ్రీకాకుళం జిల్లా జట్టు 6-0 పాయింట్లతో, విశాఖపట్నం జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా జట్టు 8-0 పాయింట్లతో విజయం సాధించాయి.

ఉత్సాహంగా ప్రారంభమైన సిపిఎం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎం గుంటూరు జిల్లా 25వ మహాసభ శనివారం స్థానిక బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా ప్రారంభమైంది. మహాసభలు జరిగే ప్రాంతానికి సీతారాం ఏచూరి నగర్‌గా, వల్లభనేని సాంబశివరావు ప్రాంగణంగా నామకరణం చేశారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు అంజిరెడ్డి ఎగురవేశారు. అనంతరం అమర వీరుల స్తూపానికి, సీతారాం ఏచూరి, వల్లభనేని సాంబశివరావు, మాకినేని బసవపున్నయ్య తదితర నాయకులు చిత్రపటాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, మహాసభ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తర్వాత జరిగిన మహాసభకు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, ఎస్.ఎస్.చెంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎల్.అరుణ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. మహాసభల జయప్రదానికి అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్‌ల నాయకులు రూ.25 వేలు విరాళాన్ని మహాసభలో పార్టీ నాయకులకు అందచేశారు. ప్రజానాట్య మండలి సీనియర్ గాయకులు జగన్, రాఘవయ్య, పద్మ, శ్రీనివాసరావు తదితరులు విప్లవ గేయాలు, అమర వీరుల గేయాలు ఆలపించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. గత మహాసభ నుండి నేటి వరకూ పార్టీ చేపట్టిన కార్యక్రమాలు, అనుభవాలపై కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు ప్రజాస్వామ్య పద్ధతిలో సమగ్రంగా చర్చించి అభిప్రాయలు తెలియజేశారు.

మహాసభలో కార్యదర్శి నివేదికను ప్రవేశ పెడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

మాకినేని బసవపున్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అమర వీరులకు సంతాపం..

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు సంతాపం తీర్మానం ప్రవేశపెట్టారు. గత మహాసభ నుండి ప్రస్తుత మహాసభ కాలంలో మరణించిన పార్టీ నాయకులు, ప్రముఖులకు మహాసభ సంతాపం తెలిపింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, బెంగాల్ మాజీ సిఎం బుద్ధదేవ్ భట్టాచార్య, సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు కె.ఎన్.తివారీ, సీనియర్ జాతీయ నాయకులు సునీత్‌చోప్రా కేరళ ఎల్‌డిఎఫ్ చైర్మన్ ఎంఎం లారెన్స్, ఎంఎస్ స్వామినాథన్, వల్లభనేని సాంబశివరావు, రుద్రరాజు సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఎస్.ఎస్.సాబ్జి, పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పార్టీ సభ్యులకు సంతాపం తెలిపారు.

సీతారాం ఏచూరి, వల్లభనేని సాంబశివరావుకు నివాళులు..

దళిత, గిరిజనుల అభ్యున్నతికి చర్యలు చేపట్టాలి

తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న బూరుగ వెంకటేశ్వర్లు

దళిత, గిరిజనుల అభివృద్ధికి సమగ్ర చర్చలు చేపట్టాలని జిల్లా బూరుగ వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభలో ఆమోదించారు. జిల్లాలో షుమారు 4.50 లక్షల మంది దళితులు, 69 వేల మంది గిరిజనులు వున్నారన్నారు. వీరికి ప్రధానంగా ప్రధానంగా శ్మశాన స్థలాలు నిండిపోయి, భౌతిక ఖాయాన్ని ఖననం చేసుకోవటానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నారని, డెల్టా ప్రాంతంలో స్మశానాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. రెవెన్యూ శాఖ స్పందించి స్మశాన స్థలాలను సర్వే చేసి ఆక్రమమణల చెరనుండి విడిపించాలని, శ్మశాన స్థలాలకు వెంటనే భూములు కేటాయించాలని, ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీలు నిర్మించాలన్నారు. దళితుల, గిరిజనుల నివాస ప్రాంతాలలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా వుందని, మౌలిక వసతుల కల్పన కోసం నిధులు కేటాయించాలన్నారు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో లంక భూములకు వ్యక్తిగత పట్టాలు మంజూరు, వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రహదారుల నిర్మాణం చేపట్టాలని, రాజధాని ప్రాంతంలో లంక భూముల రైతులకు, పట్టా భూముల వలెనే కౌలు చెల్లింపు, నష్టపరిహారం ఇవ్వాలని, ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిని అవసరం ఉందని, దళిత గిరిజనుల అభివృద్ధికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

అమరావతిని ప్రజారాజధానిగా నిర్మించాలి

రాజధాని ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి

తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న ఎం.రవి

మహాసభలో మొదటి రోజు పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యంగా రాజధాని అమరావతిని ప్రజారాజధానిగా నిర్మించాలని, దళితుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తీర్మానాలు ఆమోదించారు. అమరావతిని ప్రజారాజధానిగా నిర్మించాలని, రాజధానిలో అనిశ్చిత పరిస్థితి మళ్ళీ తలెత్తకుండా చట్టబద్ధంగా, పటిష్టమైన, వ్యవస్థీకృతమైన ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం రాజధాని ప్రజలకు చట్టబద్ధంగా ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని తీర్మానం ఆమోదించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు యం.రవి ప్రవేశ పెట్టినతీర్మానానికి మహాసభలో ఆమోదం తెలిపారు. విభజన చట్టంలో హామీ ఇచ్చిన విధంగా రాజధాని అమరావతికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, అందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయంలో రాజధాని పనులు నత్తనడకన సాగాయని, వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతి రాజధానిని నిర్వీర్యం చేశారన్నారు. రాజధాని అభివృద్ధి పనులలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాజధాని జాప్యం అయినందున కౌలు, పేదలకు పెన్షన్ మరో 10 ఏళ్లు పొడిగించాలని, ఆసైన్డ్ భూములకు సమాన ప్యాకేజి ఇవ్వాలని, ఉపాధి కల్పించే పరిశ్రమలు రాజధానిలో ఏర్పాటు చేయాలని, పనులు కోల్పోయిన కూలీలు, పేదల ఉపాధికి నర్సరీలు, ఇతర ఏర్పాట్లు చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, రైతులకు ఇచ్చిన రిటన్‌బుల్ ప్లాట్స్ అభివృద్ధితో పాటు, గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పన చేపట్టాలని, రాజధాని యూనివర్శిటీలలో విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని, ఇఎస్ఐ హస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంబించి త్వరతగతిన పూర్తి చేయాలని, రాజధాని రైతులు, కూలీలు, కార్మికులపై పెట్టిన ఆక్రమ కేసులన్ని ఎత్తివేయాలని, సిఆర్‌డిలో పనిచేస్తున్న కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పేద, మధ్యతరగతి ప్రజలకు గృహ నిర్మాణం చేపట్టాలని, రాజధానిలో నిర్మించిన టిడ్కో గృహాల బ్యాంక్ ఋణాలను రద్దు చేయాలని, గృహసముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అసెంబ్లీ, హైకోర్టులలో హౌస్‌కీపింగ్ చేస్తున్న కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్స్‌కు నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరించాలని, రాజధాని అభివృద్ధి కమిటీలలో అధికారులతో పాటు, రాజధాని రైతులు, కూలీలు, కార్మిక సంఘాలను భాగస్వాములను చేసి వారి సలహాలు తీసుకోవాలని, రాజధాని మహిళా కార్మికులపై లైంగిక వేధింపుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని, రాజధానిలో కాలుష్యం పెరగకుండా మొక్కలు నాటాలని, కొండవీటి వాగు ముంపు శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, యు.ఐ, గ్రీన్ జోన్‌లను ఎత్తివేయాలని, రాజధానిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పనిచేసే వలసకార్మికులకు గృహవసతి ఏర్పాటు చేసి వారికి సదుపాయాలు కల్పించాలని కోరారు.

కార్మికవర్గ సమస్యలను పరిష్కరించాలి

తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న వై.నేతాజి

జిల్లాలో కార్మికుల సమస్యలపై పరిష్కారం కోరుతూ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు. అటోనగర్, పారిశ్రామిక ప్రాంతాలు, క్లస్టర్లు, షాపింగ్‌మాల్స్, ప్రైవేటు విద్యాసంస్థలు, ఆసుపత్రులు తదితర సంస్థల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, బోనస్, గ్రాట్యుటీ, పిఎఫ్, ఇఎస్ఐ, సెలవులు తదితర చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని, జిల్లాలో 100 పడకల ఇ.ఎస్.ఐ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికుల పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరించాలని, రాజధాని నిర్మాణ పనులలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, ట్రాన్స్‌పోర్టు కార్మికులపై భారీ పెనాల్టీలు విధించే జి.ఓ నెం 21ని రద్దు చేయాలని, డ్రైవర్లకు తీవ్ర నష్టం కలిగించే కేంద్ర న్యాయ సంహిత 106(1)(2) క్లాజ్‌లు రద్దు చేయాలని, ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాని కోరారు. కాంట్రాక్ట్ ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 5ఏళ్ల సర్వీస్ పూర్తిఅయిన కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. సిఆర్‌డిఎ పరిధిలోని పారిశుధ్య కార్మికులు, రాష్ట్ర సెక్రటేరియట్, హైకోర్టు, ప్రభుత్వ ఆసుపత్రులలో వర్క్ అవుట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులందరినీ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలన్నారు. గ్రామ పంచాయతీల్లో టెండర్ విధానం రద్దు చేసి కనీస వేతనాలు, పిఎఫ్ అమలు చేయాలని, గ్రీన్ అంబాసిడర్‌లకు కూడా ఇతర కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు, స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల, మధ్యాహ్న భోజన కార్మికులు, విఒఎ, ఆర్పీలు తది తర స్కీమ్ వర్కర్లకు రిటైర్ మెంట్ వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కల్పించాలని, అంత్యక్రియల ఖర్చు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు నిలిపి వేయాన్నారు. స్కీమ్ వర్కర్లకు పెన్షన్, ఇళ్ళ స్థలాలు ఇతర సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, కనీస వేతనం రూ.26వేలు, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, విఆర్‌ఎలకు పేస్కేల్ వర్తింప చేయాలని, నామినీలను రెగ్యులరైజ్ చేయాలని, తదితర ఎన్నికల హామీలు అమలు చేయాలని మహాసభ డిమాండ్ చేసింది.

ప్రభుత్వ రంగ విద్యను బలోపేతం చేయాలి

తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న ఎన్.భావన్నారాయణ

విద్యారంగంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, మహాసభలో సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా నాలుగేళ్ల డిగ్రీ విధానం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని తక్షణమే ఈవిధానాన్ని ఉపసంహరించుకోవాలని తీర్మానించారు. మేజర్, మైనర్ సబ్జెక్ట్స్ విధానం బికాం విద్యార్థి ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఎంచుకోవాల్సి వస్తుందన్నారు. ఆసక్తి ఉన్న సబ్జెక్టులు ఎంచుకునే స్వేచ్ఛ కోల్పోతున్నారన్నారు. కావున నాలుగేళ్ల డిగ్రీ విధానం రద్దు చేయాలన్నారు. పట్టణ, మండల కేంద్రాలలో జూనియర్ కాలేజిలు ఏర్పాటు చేసి, పేద విద్యార్థులను ఉన్నత విద్యకు ప్రోత్సహించాలని, జిఒ 77, 44లను రద్దు చేసి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఫీజు రియంబర్స్ ఇవ్వాలని, జాతీయ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3,4,5 తరగతులు విద్యార్థులను హైస్కూల్‌లో విలీనం చేస్తున్నారు. దీని వల్ల ప్రాథమిక విద్య నిర్వీర్యం అవుతుందన్నారు.

'వైసిపికి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా?'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జగన్ అధికారంలో ఉన్నప్పుడు రైతన్నలకు మద్దతు ధర, పంట నష్టపరిహారం కోసం తెలుగుదేశం పార్టీ రోడ్డెక్కి నిరసనలు తెలియజేసే వరకు కనీసం క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా రాని వైఎస్సార్‌సిపి నాయకులకు.. ఇప్పుడు ఏదో అన్యాయం జరిగిపోతోందంటూ నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పూర్తి కాకుండానే.. రైతు సోదరులకు ఏదో అన్యాయం జరిగిపోయినట్లు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక పండరీపురంలోని తన నివాసంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గడచిన అయిదేళ్లలో రైతన్నలకు కనీస పంట నష్టపరిహారం చెల్లించలేదని, గిట్టుబాటు ధర కూడా ఇవ్వలేదని చెప్పారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు క్రాప్ ఇన్సూరెన్స్‌పై నిలదీస్తేనే గానీ, చెల్లించలేదని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే రైతన్నలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, పంట కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల్లోపు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్న విషయం వైసిపి వారికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని శిక్షించాలని వినతి

ప్రజాశక్తి-పెదకూరపాడు

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని పెదకూరపాడు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. కడప జిల్లా పులివెందులలో సాక్షి విలేకరులపై దాడిని ఖండిస్తూ.. తహసీల్దార్ మీసాలు దానియేలుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దాసు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను నివారించేందుకు కఠినచట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాడులు చేసిన వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం బాధాకరమన్నారు. దాడులు నివారించకపోతే భవిష్యత్తులో జర్నలిజానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువచ్చే విలేకరులను గాయపరచడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ నాయకులు పరగటి రాజు, పర్చూరు పూర్ణచంద్రరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. మొత్తం తొమ్మిది సంఘాలకు ఎన్నికలు జరగగా.. ఏడు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవమయ్యారు. మరోస్థానంలో ఉపాధ్యక్షుడి ఎన్నిక జరగలేదు. మరోచోట అధ్యక్ష పదవికి సమాన ఓట్లు రాగా వాయిదా పడింది.

పిడుగురాళ్ల : ఆకురాజుపల్లి మేజర్ పరిధిలోని తొమ్మిది నీటి సంఘాలకు కూటమికి చెందిన తొమ్మిది మంది మాత్రమే నామినేషన్ ధాఖలు చేయడంతో అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించారు. తంగెడ మేజర్ కాలువకు సంబంధించి 11 నీటి సంఘాలకు కూడా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. తంగెడ ఛైర్మన్ పదవికి పగడాల భాస్కరరావు నామినేషన్ దాఖలు చేశారు. రామాపురం మేజర్ పరిధిలోని ఎనిమిది నీటి సంఘాలకు ఎనిమిది మంది అధ్యక్షులను, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురజాల మేజర్ పరిధిలో 12 నీటి సంఘాలు ఉండగా.. మొత్తం ప్రక్రియ ఏకగ్రీవం అయినట్లు సంబంధించి అధికారులు వెల్లడించారు.

ఏకాభిప్రాయం.. ఏకగ్రీవం

- సాగునీటి సంఘం ఎన్నికలు దాదాపు ఏకపక్షంగానే..
- స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతం

ప్రజాశక్తి-బెల్లంకొండ

సాగునీటి సంఘం ఎన్నికలు దాదాపు ఏకాభిప్రాయంతోనే ముగిసిపోయాయి. కొన్నిచోట్ల మినహా అధిక శాతం ఏకగ్రీవమయ్యాయి. స్వల్ప ఘటనలు మినహా.. ఎన్నిక ప్రక్రియ శనివారం ప్రశాంతంగా ముగిసింది. బెల్లంకొండ మండల ఎర్రబాలెం 59వ నీటి సంఘం ఛైర్మన్‌గా చేజర్ల ముస్తఫా ఎన్నికయ్యారు. మేజర్ కాలువ పరిధిలో 12 మంది సభ్యులు ఉండగా.. ఏకగ్రీవంగా ఎన్నిక పూర్తయ్యింది.

11 చోట్లా కూటమి వారే..

ఈపూరు: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 11 సాగునీటి సంఘాల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పది సంఘాలను టిడిపి.. ఒకటి జనసేన కైవసం చేసుకున్నాయి.

వెల్దుర్తి మండలంలో ఏకగ్రీవం

వెల్దుర్తి : వెల్దుర్తి మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని తహసీల్దార్ షేక్ బాషా ప్రకటించారు. మండలంలో నాలుగు సాగునీటి సంఘాలకు ఒక్కటి చొప్పునే దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు ఏకగ్రీవం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

మాచర్ల మండలంలో..

మాచర్ల : మాచర్ల మండలంలో అయిదు సాగునీటి సంఘాలకు ఒక్కటే దరఖాస్తు రావడంతో ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

పెదకూరపాడులో ప్రశాంతం..

పెదకూరపాడు : మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని తహసీల్దారు దానియేలు తెలిపారు. అన్ని సంఘాలకూ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక పూర్తయినట్లు ప్రకటించారు.

రెంటచింతల : రెంటచింతల మండలంలోని ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని పాలువాయి సహాయ ఎన్నికల అధికారి పల్లా రామకృష్ణ తెలిపారు. పాలువాయి ఉపాధ్యక్ష ఎన్నిక పెండింగులో ఉందని చెప్పారు.

మాచర్ల : మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో జరిగిన నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షునిగా అల్లం కొండారెడ్డి, ఉపాధ్యక్షునిగా కొలమారి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

నాదెండ్ల : నాదెండ్ల పరిధిలో నీటి సంఘాల ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి. పలుచోట్ల ఏకగ్రీవమయ్యాయి.

విజయపురిసౌత్ : వెల్దుర్తి మండలం పట్లవీడు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా చిన్న వెంకటరెడ్డి ఏకగ్రీవంగా సైదులుగౌడ్ ఎన్నికయ్యారు.



వివిధ ప్రాంతాల్లో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఆయా పరిధిలోని ఎన్నికల అధికారులు నియామకపత్రాలు అందజేశారు. ఆ చిత్రాలు...

చదువు రుద్దుడే.. ఆటపాటల్లేవ్!

- కార్పొరేట్ పాఠశాలలకు ఆట స్థలాలేవీ?
- ఎక్కడా కానరాని నిబంధనలు
- యాంత్రికంగా తయారవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పిల్లలకు క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి. విద్యార్థి దశలో చదవు ఎంత అవసరమో.. ఆటపాటలూ అంతే ముఖ్యం. నేడు విద్య ఖరీదైన వస్తువుగా మారడం.. పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలవాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో తల్లిదండ్రులు కూడా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కార్పొరేట్ పాఠశాలల పుణ్యమానీ.. బడుల్లో ఆటమైదానాలు కూడా ఉండటం లేదు. ఎంతసేపూ చదువు రుద్దుడే అవుతోంది. పట్టణంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఎక్కడా క్రీడా మైదానాలు కనిపించడం లేదు. వాస్తవానికి ఆట స్థలాలు ఉంటేనే.. విద్యాసంస్థలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ నిబంధనలేవీ ఇక్కడ అమలు కాకపోవడం గమనార్హం. దీంతో నిత్యం చదువులే లోకంగా మారుతున్న విద్యార్థులు.. తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పర్యావసనంగానే మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మానసిక ఉల్లాసం, ఆహ్లాద, శాస్త్రీయ పద్ధతుల ద్వారా విద్యా బోధన చేస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలు.. ఆచరణలో చూపించడం లేదు. ఫీజుల రూపంలో మాత్రం తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీ చేస్తున్నాయి. విద్యార్థులకు చదువుతోపాటు వారికి ఇష్టమైన ఆటల్లో శిక్షణ ఇచ్చి, ప్రోత్సహించి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆయా విద్యా సంస్థలపై ఉం ది. ఉన్నత పాఠశాలకు ఎకరా, జూనియర్ పాఠశాలకు రెండు ఎకరాల విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాలు చూపించాలి. అయితే, ఈ నిబంధన ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. అనుమతులు మంజూరు చేసే టప్పుడు విద్యా సంస్థలకు సంబంధించి ఎక్కడో దూరంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను చూపిస్తున్నట్లు ఆరో పణలు ఉన్నాయి. ప్రభుత్వం నిబంధనలు అమలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు 'మామూళ్ల'గా వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు కేవలం చదువుకే పరిమితమై యాంత్రికంగా తయారవుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకు మార్గంలో ఉన్న ప్రైవేట్ విద్యాలయం

ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 15 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండగా.. 14 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 62 బగుబండ సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులుగా కందులవారుపాలెం గ్రామానికి చెందిన పాములపాటి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా భగుబండ గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.. 80 దూళిపాళ్ల 1కు అధ్యక్షులుగా చిమట శివ బ్రహ్మయ్య ,ఉపాధ్యక్షులుగా బద్దల హనుమంతరావు, 80 పాకాలపాడు 1కు అధ్యక్షులుగా కాల్వపల్లి శ్రీనివాస్ రెడ్డి , ఉపాధ్యక్షులుగా షేక్ జైన్ వలి సాహెబ్, 82 కట్టమూరు అధ్యక్షులుగా చెన్నుమల్లు మోహన్ బాబు, ఉపాధ్యక్షులుగా మారిశెట్టి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. 90 ధూళిపాళ్ల 2 అధ్యక్షులుగా బైరపు తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా బోట్ల హనుమంతరావు, 93 పాకాలపాడు 2 అధ్యక్షులుగా కొంగారు సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా కొంగారు అంజయ్య, 97 లక్కరాజు గార్లపాడు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులుగా గుంటూరు రమేష్, ఉపాధ్యక్షులుగా సత్తెనపల్లి పోతురాజు ఎన్నికయ్యారు.

సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి - పెదనందిపాడు

స్వల్ప ఘటనలు మినహా శనివారం జరిగిన సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ప్రశాంతంగా ముగిశాయి. పెదనందిపాడు మండలంలో అన్నపర్రు 179 నీటి సంఘం అధ్యక్షులుగా జెట్టి సీతమ్మ, ఉపాధ్యక్షులుగా కొల్లా శివ బసవ పున్నయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి జి.లక్ష్మీదేవి నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేశారు.కాకుమాను మేజర్ కాలువ 186 నీటి సంఘం అధ్యక్షులుగా పోతినేని వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పెర్నేని సాంబశివరావు ఎన్నికయ్యారు.

తెనాలిరూరల్ : తెనాలి మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా సాగాయి. ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తెనాలి తహసీల్దార్ కెవి గోపాలకష్ణ పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా ప్రశాంతంగా ముగిశాయన్నారు.

ఏకగ్రీవంగా నీటి సంఘాల ఎన్నికలు

కొల్లిపర : మండల పరిధిలోని కొల్లిపర, శివలూరు, అత్తోట, మున్నంగి, వల్లభాపురం నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా..

ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న అధికారులు

ఎన్నిక ప్రక్రియను పరిశీలిస్తున్న తెనాలి తహసీల్దారు గోపాలకృష్ణ

అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహసీల్దార్ సిద్ధార్థ తెలిపారు. కొల్లిపర నీటి సంఘాలకు అధ్యక్షునిగా కోటా వీరాంజనేయులు, ఉపాధ్యక్షునిగా కట్ట శ్రీహరిరెడ్డి, శివలూరు అధ్యక్షునిగా తోట ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా ఎ.శివనాగ మల్లేశ్వరరెడ్డి, వల్లభాపురం టీసీ అధ్యక్షునిగా బొట్టా శ్రీరాములు రెడ్డి, మున్నంగి టీసీ అధ్యక్షునిగా బోనం వెంకట్ రెడ్డి, అత్తోట నీటి సంఘాల అధ్యక్షునిగా సోమరాజు రవి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దుగ్గిరాల : గుండిమెడ నీటి వినియోగదారుల అసోసియేషన్ అధ్యక్షునిగా మేడూరి ధనలక్ష్మి, పెద్ద కొండూరు నుంచి పాలెం బాజీబాబు, చినపాలెంలో వి.శేషగిరిరావు, పేరుకలపూడిలో జి.నాగేశ్వరావు , దుగ్గిరాలకు సంబంధించి గౌర్నేని అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ నెల 17వ తేదీన ఒకరిని డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకుంటారని ఏఈ కె.లక్ష్మీనారాయణ తెలిపారు.

ముఖ్యమంత్రికి ఆరోగ్య సహాయకుల వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

మెడికల్ విభాగంలో హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమను ఆదుకోవాలని ఏపీ కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో హెల్త్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 1,700 మందిని ఇటీవల తొలగించారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తొలగింపునకు గురైన వారంతా 50 ఏళ్ల వయస్సు దాటిన వారేనని తెలిపారు. సుమారు 22 సంవత్సరాలుగా వైద్య శాఖలో సేవలందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరారు. ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల సమయంలో హెల్త్ అసిస్టెంట్లు కీలకంగా పని చేసిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు టి.గిరి, జి.నాగరాజు, అరుణ్ ఉన్నారు.

మంగళగిరి వంద పడకల ఆసుపత్రి అభివృద్ధికి హామీ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి మంత్రి నారా లోకేష్ విజన్‌కు తగ్గట్టుగా అభివృద్ధి జరుగుతుందని ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మంత్రి లోకేష్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి అభివృద్ధిపై చర్చించారు. మంగళగిరి అభివృద్ధికి మంత్రి కట్టుబడి ఉన్నారని చెప్పారు. రోడ్లు, చేనేత భవనం అభివృద్ధికి చర్చించినట్లు చెప్పారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పెదకాకాని

నంబూరు గ్రామంలోని యానాది కాలనీలో పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జన్మదినం సందర్భంగా 50 మంది చిన్నారులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేసినట్లు స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచందర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహారం పంపిణీ

చేబ్రోలు : ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదినం సందర్భంగా 'మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో కూటమి నాయకులు సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. నిడుబ్రోలు రైల్వే స్టేషన్ దగ్గర ఉంటున్న నిరుపేదలకు భోజనం ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో తిరుమల శెట్టి ఉమాశంకర్, చిలకపాటి సింహాద్రి, పోలిశెట్టి విజయకుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో సమయపాలన కీలకం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దూరప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్ - విజయవాడ హౌస్ డివిజన్) ఎ.అప్పలరాజు తెలిపారు. సమయపాలన ద్వారా సంబంధిత రూట్లలో పికప్ పాయింట్ల వద్ద బస్సులను కొద్దిసేపు నిలుపుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. శనివారం తెనాలిలో ఆయన పర్యటించారు. గుంటూరు డీపీటీవో ఎం.రవికాంత్ తో కలిసి ఆర్టీసీ డిపోలోని పలు విభాగాలను పరిశీలించారు. డిపోకు అత్యధిక ఆదాయం సమకూర్చిన ముగ్గురు కండక్టర్లను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. డిపో గ్యారేజీ నుంచి ఏసీ మెకానిక్ వి.జోషి బాబు, అత్యధిక కెఎంపిఎల్ తీసుకొచ్చిన కెఎస్ కృష్ణలకు పారితోషకం అందించారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న సిబ్బందితో అప్పలరాజు

కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ధిష్టమైన లక్ష్యంతో ఉన్నత శిఖరాలకు..

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నిర్ధిష్టమైన లక్ష్యం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రోటరీ(3150) డిస్ట్రిక్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి అన్నారు. శనివారం స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ పాఠశాలలో రోటరి క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, తెనాలి వైకుంఠపురం రోటరి క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్, డైనింగ్ హాల్ ను ప్రారంభించారు. రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన వివేకానంద, సరస్వతీ దేవి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశయాల సాధనకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని, గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధులు

కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా 'పోతినేని' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-మంగళగిరి

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి పట్టణంలోని పిఎస్ఆర్ భవన్ వద్ద పిఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో కేక్‌ను దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షురాలు కేసంనేని అనిత, మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, గోసాల రాఘవ, షేక్ సుభానిలు కట్ చేసి పంచిపెట్టారు.

'వీరంకి'కి అభినందనలు

ప్రజాశక్తి- మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వీరంకి వెంకట గురుమూర్తికి పలువురు అభినందనలు తెలియజేశారు. శనివారం గుంటూరు జిల్లా పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

'మహా గర్జన సభకు తరలిరావాలి'

ప్రజాశక్తి-మంగళగిరి

గుంటూరులోని నల్లపాడులో ఆదివారం జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని అఖిలభారత మాలల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్, వైస్ చైర్మన్ గుర్రం రామారావు పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నటువటి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరారు. ముందుగా కుల గణన చేసిన తర్వాత జనాభా, ఉపాధి ఉద్యోగ అవకాశాలు పరిశీలించి అప్పుడు ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అనంతరమే డీఎస్సీ ప్రకటిస్తాం అనడం కాదని, తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అశోక్ కుమార్, నాగేశ్వరావు, టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మంగళగిరిలో ధనుర్మాస మహోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి బైపాస్ రోడ్డు బాపూజీ విద్యాలయం ప్రాంగణంలో ఈ నెల16 నుంచి జనవరి 13వ తదీ వరకు నెల రోజుల పాటు ధన్ముర్మాస వ్రత మహెూత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వైటీఆర్ ట్రస్ట్ చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్ తెలిపారు. శనివారం బాపూజీ విద్యాలయం అవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లైలా గ్రూప్స్ చైర్మన్ గోకరాజు గంగరాజుతో కలసి మాట్లాడారు. మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దివ్య ఆశీస్సులతో అమరావతి రాజధాని అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో ధనుర్మాస వ్రత మహెూత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, గీతాలాపన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ 15 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం అందజేయనున్నట్లు వివరించారు. సమావేశంలో క్రేన్ సంస్థ చైర్మన్ గ్రంధి కాంతారావు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సెక్రటరీ సదిమేల శ్రీకూర్మానాథస్వామి, సీతానగరం జీయర్ అశ్రమ ప్రతినిధులు పురాణం వెంకటార్యులు, మధుసూధనచార్యులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

5 నుండి యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ప్రజాశక్తి-గుంటూరు

యూటీఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జనవరి 5-8 తేదీల్లో కాకినాడ పట్టణంలో పిఆర్ డిగ్రీ కాలేజిలో స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చేయడంలో కీలక భూమిక పోషించడం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేసేందుకు నికరంగా పనిచేయడం వల్ల యూటీఎఫ్ ప్రజల, ఉపాధ్యాయుల, ఉద్యోగుల మద్దతు పొందిందన్నారు. కరోన కాలంలో ప్రజల కోసం సామాజిక కార్యక్రమాలు చేపట్టిన ఏకైక సంఘం యుటిఎఫ్ అన్నారు. కాకినాడలో జరిగే మహాసభలలో విద్యాసదస్సు, ఉద్యమ సదస్సు, సాహితీ సదస్సు, మహిళ సదస్సులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలలో ప్రత్యామ్నాయ విద్యావిధానంపై చర్చ జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు రాష్ట్ర వివిధ రాజకీయ పార్టీల నాయకులను, సాహితీ వేత్తలను, విద్యారంగ ప్రముఖులు, మహిళ నాయకులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వేలాదిగా ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహధ్యక్షురాలు ఎ.ఎన్.కుసుమకుమారి, జిల్లాఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, యం.కళాధర్, జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, యం.డి.షకీలా బేగం, ఎ.శ్రీనివాసరావు, కె.రంగారావు జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాస్‌కార్తీక్, ఎస్.కె.బాజీబాబా పాల్గొన్నారు

ఉపాధి అవకాశాలపై హిందూ ఫార్మసీలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న సతీష్‌కుమార్

క్లినికల్ రీసెర్చ్, మెడికల్ డివైజెస్, రెగ్యులేటరీ రంగాలలో ఫార్మసీ నిపుణులకు విస్తృత ఉపాధి అవకాశాలు స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో 'క్లినికల్ రీసెర్చ్ అండ్ రెగ్యులేటరీ రైటింగ్ ఇన్ మెడికల్ డివైజెస్ ఐయం డిఆర్ అండ్ ఈయుయండిఆర్' అనే అంశంపై హైదరాబాద్‌లోని క్లినాక్సి ప్రైవేటు లిమిటెడ్ వారి సహకారంతో వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్లినాక్సి ప్రైవేటు లిమిటెడ్ సిఇఒ వి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మసీ నిపుణులకు క్లినికల్ రీసెర్చ్ రంగంలో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉన్నాయని అన్నారు.ప్రస్తుతం మన దేశంలోని వివిధ నగరాలలో సుమారు వంద క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్లు (సిఆర్ఒ) ఉన్నాయని, వారు నూతన ఔషధాలపై నిర్వహించే క్లినికల్ ట్రయల్స్ ఫార్మకోవిజిలెన్స్, క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్ రెగ్యులేటరీ అప్రూవల్స్ లాంటి పరిశోధనలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు బి.ఫార్మసీతో పాటు క్లినాక్సి లాంటి సంస్థలు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులను చేయటం ద్వారా తమ ఔషధ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. కళాశాల ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య గారు మాట్లాడుతూ ఫార్మసీ నిపుణులకు ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతి ప్రధానం చేశారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, డాక్టర్ పి.నాగరాజు, సి. హెచ్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నరేంద్ర పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఉన్నత పదవులు అధిరోహించాలని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ. సింహాచలం అభిల షించారు. శనివారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పుట్టినరోజు సందర్భంగా యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ఉజ్వల హోమ్‌లో కేక్ కట్ చేశారు. అక్కడి అనాథ పిల్లలకు భోజనం, ఫ్రూట్స్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో నరేంద్ర కుమార్ ఉన్నత పదవులు అధిరోహించాలని కొరుకుం టున్నామని పేర్కొన్నారు. దూరవిద్య కేంద్రం పరిక్షల ఇన్చార్జి సమన్వయకర్త అచార్య డి. రామచంద్రన్ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గం నుంచి అనేకసార్లు నరేంద్ర కుమార్ ను ప్రజలు గేలిపిస్తున్నారంటే కుల, మతాలకు అతీతంగా ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, అంకింత భావం, నిస్వార్ధ సేవలే నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం ఇన్చార్జి డైరెక్టర్ ఆచార్య వి .వెంకటేశ్వర్లు, టిఎన్ఎస్ఎఫ్, టిఎన్టియుసి సమన్వయకర్త డాక్టర్ మండూరి వెంకటరమణ, టిడిపి మండల నాయకులు కొరటాల రవీంద్ర, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్, టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రాయవరపు హరీష్ , ఉదయ్, మనోజ్, జేఎమ్ జె హోమ్ నిర్వాహకురాలు సిస్టర్ రోజ్ లీనా తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ కంపెనీల భూముల వివాదం

వీక్షణం

పల్నాడు జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తామని రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు తీసుకుని పలాయనవాదం అవలంభిస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేక పోతుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు చెందిన సరస్వతీ సిమెంట్ ప్లాంటుకు సంబంధించి దాదాపు 16 ఏళ్లక్రితం కొనుగోలు చేసిన భూముల్లో అసైన్డు భూములు ఉన్నాయని గగ్గోలు పెట్టిన కూటమి ప్రభుత్వం కేవలం 17.69 ఎకరాలు మాత్రమే స్వాధీనం చేసుకున్నట్టు మాచవరం తహశీల్దార్ చేత ఉత్తర్వులు ఇప్పించారు. అయితే మిగతా కంపెనీల సంగతి ఏమిటన్న ప్రశ్నకు అధికారుల నుంచి ఎటువంటి సమాధానం లేదు. పల్నాడు ప్రాంతంలో దాదాపు 20 ఏళ్ల క్రితం అంబూజా, రాజపుష్ప, హిమామి, మైహోం, సంఘీ తదితర కంపెనీలు రైతుల నుంచి భూములు తీసుకున్నారు. వీరు కూడా అనేక మంది రైతుల వద్ద అసైన్డు భూములు కొనుగోలు చేశారు. అయితే వీటి గురించి గత 15 ఏళ్లుగా ఏ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. రైతుల వద్ద తక్కువ ధరకు భూములు తీసుకుని తాము సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని వీటిల్లో మీ పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికారు. దాదాపు 9 వేల ఎకరాల వరకు గత 15 ఏళ్లుగా బీడు భూములుగా మారాయి. ఈ తరహాలోనే వైఎస్ జగన్ కూడా సరస్వతి పవర్ ప్లాంట్ పేరుతో భూములు తీసుకున్నారు. జగన్‌తో పాటు మిగతా అన్ని కంపెనీల వారు బడా పారిశ్రామిక వేత్తలే. కానీ జగన్ కంపెనీకు చెందిన భూములను మాత్రమే కొద్ది రోజుల క్రితం డిప్యూటీ సీఎం పవన్ పరిశీలించారు. జగన్ భూములను చెరబట్టారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం మాచవరం తహశీల్దార్ 17.69 ఎకరాల భూమిని వెనక్కి తీసుకుంటున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారు. గురజాల, దాచేపల్లి మాచవరం మండలాల్లో ని పలు సిమెంట్ కంపెనీలు భూములు తీసుకున్నట్టుగానే పలు గ్రామాల్లో జగన్ సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ కోసం 16 ఏళ్ల క్రితం రైతుల నుంచి భూములు కోనుగోలు చేశారు. వీటితో పాటు కొన్ని అసైన్డ్ భూములు కూడా స్వాదీనం చేసుకున్నారనీ ఆరోపణలు ఉన్నాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనూ ఈ సిమెంట్ కంపెనీల నిర్వహాకులందరూ రైతుల నుంచి భూములు కొనుగోలు చేశారు. దీని పైన అప్పట్లోనే వివాదం చోటు చేసుకుంది. అంతేగాక 2009లో ఆ జగన్ ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. జగన్ -షర్మిల వివాదం లోనూ సరస్వతి పవర్ అంశం పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. వైసిపి హయంలో తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టారన్న కారణంతో జగన్‌ను లక్ష్యంగా చేసుకుని కొద్ది రోజుల క్రితం డిప్యూటీ సీఎం పవన్ పల్నాడులో సరస్వతి పవర్ కు కేటాయించిన భూములను పరిశీలించారు. ఆ సమయంలోనే 1324. 93 ఎకరాల భూమిని అక్రమంగా తీసుకున్నారని ఆరోపించారు. సరస్వతి కంపెనీ కి కేటాయించిన భూముల్లో అటవీ, అసైన్డ్ లాండ్స్ ఉన్నాయనేది పవన్ కల్యాణ్ ప్రకటించారు. అయితే అధికారులు కేవలం 17.69 ఎకరాలే ప్రభుత్వ భూమి ని వేరే సాగు దారుల నుంచి కొన్నారని నిర్ధారించారు. మిగతా భూమి అంతా పట్టాభూమిగానే తేల్చారు. వేమవరం గ్రామం లో 13.80 ఎకరాలు,పిన్నెల్లి గ్రామంలో 3.14 ఎకరాలు స్వాదీనం లోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ భూములు మొత్తం ప్రభుత్వం గతంలో రైతులు సాగు చేసుకునేందుకు అందజేసిందని రైతులు సరస్వతి పవర్ ప్రాజెక్టుకు భూములు అమ్ముకున్నారని తహశీల్దార్ క్షమారాణి తెలిపారు. అయితే కేవలం ఒక్క సంస్థపైనే దృష్టి పెట్టడం ఏమిటని, రైతులను మోసం చేసినా మిగతా ఆరు కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోరన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. పల్నాడులో టిడిపి నాయకులు కూడా ఈవిషయంలో మౌనం దాల్చారు. గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల్లోని దాదాపు 20 గ్రామాల పరిధిలో ఆరు సిమెంట్ కంపెనీల వారు కూడా ప్రకతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు చెరబట్టారన్న ఆరోపణలు లేకపోలేదు. వాగులు, వంకలు, కొండలు ఉన్నందున అధికారులు సిమెంట్ కంపెనీలకు ఎలా అనుమతి ఇచ్చారన్న అంశంపై నాయకులు నోరుపెదపడం లేదు. గత 15 ఏళ్లుగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా కాలయాపన చేస్తున్న వారిపై ఒక్క శాఖ అధికారి కూడా కన్నెత్తి చూడటం లేదు. విలువైన మైనింగ్ ఉన్న భూముల్లో ప్రభుత్వ భూములు, జల వనరులు ఏ మేరకు ఉన్నాయో, ఎంత అటవీభూమి ఉన్నదో కూడా పరిశీలి ంచాల్సిన అధికారులు కేవలం రాజకీయ వత్తిడితో సరస్వతి కంపెనీ భూముల పరిశీలనకే పరి మితం అయ్యారు. మిగతా వాటిని పట్టించుకోవడం లేదు.

(ఎ.వి.డి.శర్మ)

17న ఎయిమ్స్‌కు రానున్న రాష్ట్రపతి ముర్ము

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - మంగళగిరి

17 వ తేదీన మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రథమ స్నాతకోత్సవ కార్యక్రమంలో భారత దేశ రాష్ట్రప. ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పి సతీష్ కుమార్, ఐ ఎస్ డబ్ల్యూ అధికారి ఆరిఫ్ హఫీజ్, అధికారులు కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రపతి ఎయిమ్స్‌కు చేరుకునే ప్రవేశ ద్వారం నుండి వారు బస చేసే ప్రాంతం, అలాగే ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవ కార్యక్రమాల సందర్భంగా తీసుకోవలసిన భద్రత ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. భారత రాష్ట్రపతి పాల్గొంటున్న స్నాతకోత్సవ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతగా, ప్రతిష్టాత్మకంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. ప్రధానంగా ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవ కార్యక్రమానికి అతిధులందరు ఉదయం 10.00 గంటల లోపు వారివారి సిట్లలో కూర్చునే విధంగా సంబంధిత ఎయిమ్స్ అధికా రులు పర్యవేక్షించాలన్నారు. ఫైర్ సేఫ్టీ వెహికల్‌ను ఏర్పాటు చేయాలని అగ్నిమాపక సిబ్బందికి సూచించారు. ప్రథమ స్నాతకోత్సవ కార్యక్రమ ంలో అధికారులకు కేటాయించిన డ్యూటీలు సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 16వ బెటాలియన్ కమాండెంట్ మురళీ కష్ణా, రైల్వే గుంతకల్ ఎస్పి రాహుల్ మీనా, గ్రే హౌండ్స్ ఎస్పి సునిల్ షారోన్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, ఎయిమ్స్ డిప్యూటీ డైరక్టర్ శశికాంత్, డిఎంహెచ్ఓ డా కె.విజయ లక్ష్మి, డిఎస్ఓ పి.కోమలి పద్మ, ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నటరాజ్, అడిషినల్ ప్రొఫెసర్ శంకరన్, తదితర అధికారులు పాల్గొన్నారు.